నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శుక్రవారం 30 మే 2025 | NALGONDA

## వానకాలం సాగు షురూ..




పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు

యాదాద్రి భువనగిరి, మే 29 (నమస్తే తెలంగాణ): జిల్లాలో వానకాలం సాగు పనుల్లో రైతులు బిజీ అయ్యారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వానకాలం సాగు ఆశాజనకంగా షురూ అయ్యింది. పొలాల్లో దుక్కులు దున్నుతున్నారు. వరి నార్లు పోసేందుకు సిద్ధమవుతున్నారు. పత్తి విత్తనాలు విత్తుతున్నారు. ఇప్పటికే వలిగొండ, పోచంపల్లి, రామన్నపేట, రాజాపేట, బీబీనగర్ మండలాల్లో పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4,40,500 ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో అత్యధికంగా 2,95,000 ఎకరాల్లో వరి వేయనున్నట్లు భావిస్తున్నది. ఆ తర్వాత 1,15,000 ఎకరాల్లో పత్తి వేసే అవకాశం ఉందని లెక్కలు వేసింది. కాగా గతేడాది వానకాలంలో 4,25,144 ఎకరాల్లో పంటలు వేశారు. ఇక ఈ సీజన్‌లో అన్ని నెలలు కలిపి 75,039 మెట్రిక్ టన్నుల ఎరువులు, మందులు అవసరపడతాయని, మేలో జిల్లాకు 6,998 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉన్నది.

## భవిత కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



మర్రిగూడలో భవిత సెంటర్‌ను తనిఖీ చేసి అధికారులతో మాట్లాడుతున్న నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి



# ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు!

- పత్తాలేని ట్రాన్స్‌ఫార్మర్లు, కనెక్షన్లు
- డీడీలు చెల్లించినా తప్పని పడిగాపులు
- అందుబాటులో లేని మెటీరియల్
- ఏడాది కాలంగా పెండింగ్‌లోనే పనులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్
- బడ్జెట్ కేటాయింపులో నిర్లక్ష్యం

కేసీఆర్ పాలనలో రెప్పపాటు కరెంటు పోలే.. రైతుల కోసం అనేక పథకాలు తీసుకొచ్చారు. ఎన్ని కోట్ల రూపాయలయినా లెక్క చేయకుండా ఖర్చు చేశారు. ఆయన తీసుకొచ్చిన పథకాలన్నీ సక్సెస్ కావడంతో పంటలు మస్తుగ పండినయ్.. రైతుల బతుకులు చింతలేకుండా గడిచినయ్..

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కర్షకుల కష్టాలు పట్టించుకోవడం లేదు. కరెంటు కోతలు మొదలయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్ల మీద అధికలోడు పడుతున్నది. తరచూ ట్రిప్ అవుతున్నాయి. మోటర్లు కాలిపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి యాదాద్రి జిల్లాలోని పలువురు రైతులు వ్యవసాయానికి కొత్త ట్రాన్స్ ఫార్మర్లు, కనెక్షన్ల కోసం డీడీలు కట్టారు. నెలలుగా గడుస్తున్నా ట్రాన్స్‌ఫార్మర్ల ఊసేలేదు.. ఒక్క కొత్త విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. బడ్జెట్ లేదనే సాకుతో జాప్యం చేస్తున్నారు. వాన కాలం ప్రారంభం కావడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యాదాద్రి భువనగిరి, మే 29 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో భువనగిరి, చౌటుప్పల్‌లో ఎక్కడికక్కడ సబ్ డివిజన్లు ఉన్నాయి. అయితే రైతులు నేరుగా వినియోగదారుల సేవా కేంద్రం ద్వారా ట్రాన్స్ ఫార్మర్ కనెక్షన్ల కోసం నమోదు చేసుకోవాలి. 25 హెచ్‌పీ ట్రాన్స్ ఫార్మర్ పొందాలనుకునే రైతులు రూ.5,787 చొప్పున మూడు డీడీలు ముగ్గురు రైతులు విద్యుత్ శాఖ పేరుతో తీయాలి. అలాగే రైతు భూమి పాసుబుక్, ఇంటి కరెంట్ బిల్, రెండు ఫొటోలు ఇవ్వడం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు అవుతుంది. ఇందులో రైతులు రసీదు కూడా పొందే అవకాశం ఉంది. ఈ రసీదును ఏఈకి అందజేయడం, అనంతరం లైన్‌మెన్ ద్వారా రైతుకు ఏ మేర స్తంభాలు, వైరు అవసరమవుతుందో అంచనా వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పనులు మంజూరైన వెంటనే కాంట్రాక్టర్ ద్వారా అధికారులు పనులు చేయిస్తారు. జిల్లాలో సుమారు 200 ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు డీడీలు చెల్లించారు. ఒక్క మోత్కూర్ సబ్ డివిజన్ పరిధిలోనే 50 వరకు ఉన్నాయి. కానీ ఒక్క చోట కూడా ట్రాన్స్‌ఫార్మర్ బిగించిన దాఖలాలు లేవు. రైతులు మాత్రం దిమ్మలు కట్టుకుని.. ఏర్పాట్లు చేసుకుని ఆశగా ఎదురు చూస్తున్నారు.

### ఆరు నెలలు దాటినా ఇస్తలే..

“నేను 2024 నవంబర్ లో 29న ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీ చెల్లించాను. ట్రాన్స్‌ఫార్మర్ వస్తుందని ఆశపడ్డాను. అందుకోసం ఏర్పాట్లు కూడా చేశాను. బిగించేందుకు దిమ్మె కట్టాం. ఆరు నెలలు దాటినా ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పటికే వానకాలం ప్రారంభమైంది.. ఎప్పుడు ఇస్తారో లేదో తెలియదు. ప్రభుత్వం రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి.

-జిట్ట సోములు, రైతు, పాడిచేడు, మోత్కూర్

### మెటీరియల్ కొరత..

జిల్లాలో కరెంట్ పనుల కోసం మెటీరియల్ కొరత తీవ్రంగా వేధిస్తున్నది. ఏ ఒక్క ఐటమ్ కూడా అందుబాటులో లేదు. నల్లగొండ స్టోర్ నుంచి యాదాద్రికి సామగ్రి సరఫరా అవుతున్నది. కానీ ఏడాది కాలంగా వస్తువులు రావడమే గగనం అయ్యింది. కండక్టర్, వైర్, ఐరన్, కేబుల్ తదితర మెటీరియల్ రావడం లేదు. ఆరు నెలల కాలంలో ఒక్క వలిగొండ సెక్షన్ కు 2కిలో మీటర్ల కండక్టర్ మాత్రమే వచ్చిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కరెంట్ స్తంభాలు సైతం లేవు. సాధారణంగా ఎండాకాలంలోనే కరెంట్ పోల్ సమస్యలు సరిచేస్తుంటారు. విద్యుత్ బాల్ లేకపోవడంతో పనులు చేయడం లేదు.

### బడ్జెట్ కేటాయించలే..

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎన్నడూ కరెంటు కష్టాలు కనిపించలేదు. ఎలాంటి చిన్న సమస్య వచ్చినా అప్పటికప్పుడు పరిష్కరించేవారు. నిధులకు కొదువ ఉండేది కాదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్ కనెక్షన్లు కూడా ఇవ్వలేని దుస్థితి దాపురించింది. వాన కాలం ప్రారంభం కావటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతులు విద్యుత్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నా లాభం ఉండటం లేదు. అధికారులు మాత్రం బడ్జెట్ లేదని, పైనుంచి రావడంలేదని చెప్పుకొస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కాంట్రాక్టర్లు ట్రాన్స్‌ఫార్మర్లను బయట కొనుగోలు చేస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు

## పెట్రోల్ బంకుల్లో మోసాలకు పాల్పడుతున్న
# అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్

**రూ.2 లక్షల నగదు, ఒక మోటర్ సైకిల్, ఆరు ఏటీఎం కార్డులు, మొబైల్ ఫోన్ స్వాధీనం**

మిర్యాలగూడ, మే 29: పెట్రోల్ బంక్‌లే టార్గెట్‌గా మోసాలకు పాల్పడుతూ డబ్బులను దోచుకుంటున్న అంతర్రాష్ట్ర నిందితుడిని అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. గురువారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 11న నాగార్జున సాగర్‌లోని పైలాన్ కాలనీలో హైవే పక్కన గల భారత్ పెట్రోల్ బంక్‌లోకి ఒక వ్యక్తి వెళ్లి అక్కడ పనిచేసే పంప్ బాయ్‌తో తన బావకు ఆరోగ్యం బాగాలేదని డబ్బులు అత్యవసరమని చెప్పి కర్ణాటక బ్యాంక్‌కు చెందిన ఏటీఎం డెబిట్‌కార్డు ఇచ్చి మొదటిసారి స్వైపింగ్ మిషిన్‌లో స్వైప్ చేసి రూ.35,350 తీసుకుని వెంటనే రెండవసారి స్వైప్ చేసి రూ.30,250 తీసుకున్నాడు. పంప్ బాయ్ లంచ్‌కు వెళ్లే సమయంలో బిజీగా ఉన్నది చూసి స్వైపింగ్ మిషిన్‌ను దొంగతనంగా తీసుకొని తన డబ్బులను వాయిడ్ అనే యాప్ ద్వారా తిరిగి తన అకౌంట్‌లోకి రిటర్న్ చేసుకున్నాడు. అతను వెళ్లిన అనంతరం డబ్బులు తేడా రావడంతో ఈనెల 16న బ్యాంక్‌కు వెళ్లి చెక్ చేసుకోగా డెబిట్ కార్డు ద్వారా స్వైప్ చేసిన డబ్బులు తిరిగి అతని అకౌంట్‌కు వెళ్లినట్లు తెలిసిందని బంక్ యజమాని బొమ్మిరెడ్డి బ్రహ్మారెడ్డి విజయపురి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గురువారం పైలాన్ కాలనీలో పోలీసులు నేర పరిశోధనలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తుండగా సాగర్ బార్డర్ చెక్‌పోస్టు వద్ద బైక్‌పై ఒక వ్యక్తి పోలీసులను చూసి వెనుకకు పారిపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకుని విచారించారు. తనది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నర్సారావుపేట మండలం, రావిపాడు గ్రామమని తన పేరు అనాల శివ అని తాను చేసిన నేరాల లిస్ట్‌ను పోలీసులకు తెలిపాడు. ఇదేవిధంగా 33 పెట్రోల్‌బంక్‌లల్లో నేరానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. ఇటీవల కాలంలో విజయపురి టౌన్, సూర్యాపేట రూరల్, మునగాల, జగ్గయ్యపేట(ఆంధ్ర),మేడికొండూరు(ఆంధ్ర), జి. కొండూరు(ఆంధ్ర)లతోపాటు బాపట్ల, గుంటూరు, విజయవాడ, పెడన, గుడివాడ, నాగులపాడు, ఒంగోలు, వినుకొండ, ఎడ్లపాడు, చౌడవరం, పురిచేడు, దర్శి, పిడుగురాళ్ల, తెనాలి, కందుకూరు, పొదిలి, గిద్దలూరులో నేరాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. మోసాలకు పాల్పడుతున్న ఇతనికి స్పెషల్ ఐడీ నెంబర్‌ను ఎంటర్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నేరస్తుడి నుంచి రూ. 2లక్షల నగదు, గ్లామర్ బైక్, ఆరు ఏటీఎం కార్డులు, ఒక మొబైల్ స్వాధీనం చేసుకుని రిమాండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీనూనాయక్, ఎస్ఐ సంపత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అహ్మదాబాద్ టు సూర్యాపేట

## శిశువుల విక్రయాల్లో కిలేడీలు



అవును... నిజం... ఊరూరా తిరిగి కోడిగుడ్లు అమ్మే మాదిరిగా నెల కూడా తిరగని శిశువులను అమ్మేస్తున్నారు. కిడ్నాప్ చేసి తీసుకొచ్చిన శిశువులు కొందరైతే... తినడానికి తిండి కూడా దొరకని అభాగ్యులకు కలిగిన సంతానాన్ని ఇరువై...ముప్పై వేలకు కొనుగోలు చేసి తీసుకువచ్చి అమ్మేవి మరికొన్ని. ఈ అక్రమ దందా చేసే కిలాడీ గుంపులో అత్యధికులు మహిళలే ఉన్నారు. నార్త్ నుంచి అధికంగా పిల్లలను ఇక్కడికి తీసుకువస్తుండగా నిన్న దొరికిన వారంతా అహ్మదాబాద్ టు సూర్యాపేట వయా విజయవాడ వస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

సూర్యాపేట, మే 29 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో చిన్నారుల కొనుగోళ్ల కోసం ఎవరో వస్తున్నారని పోలీసులకు సమాచారం ఇవ్వగా ఓ గ్రామానికి చెందిన ఇద్దరు దానిపై ఆరా తీశారు. ఇందులో పోలీసులకు విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు స్పెషల్ వింగ్‌గా ఏర్పడి విచారణ చేయగా జిల్లాలో మొత్తం 28 మంది చిన్నారులను విక్రయించగా 10 మందిని గుర్తించిన విషయం విదితమే. ముఠాలో 13 మందిని గుర్తించి అరెస్టు చేయగా వీరిలో 9 మంది మహిళలే ఉండడం గమనార్హం. మహిళా నిందితుల్లో విజయవాడకు చెందిన రమాలక్ష్మి, పావని, విజయలక్ష్మి, సత్యమణి, హైదరాబాద్ ఉప్పల్ ప్రాంతానికి చెందిన శోభారాణి, రాజస్థాన్‌కు చెందిన ఖాన్‌షాహీనా, తిరుమలగిరికి చెందిన ఎండీ సహానా, హైటెక్ సిటీకి చెందిన సునీత, సూర్యాపేటకు చెందిన ఉమారాణి ఉన్నారు.

### శిశువుల కొనుగోలు .. కిడ్నాప్..

జిల్లాలో కొంతకాలంగా పిల్లలు లేని తల్లిదండ్రులను గుర్తించి వారికి శిశువులను విక్రయించారు. వీరంతా నార్త్ నుంచి తీసుకువచ్చిన వారని తెలిసింది. వీరిలో కొంత మంది శిశువులను కొనుగోలు చేసి తీసుకురాగా.. మరికొంత మంది చిన్నారులను కిడ్నాప్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన నక్క యాదగిరి, ఉమారాణి దంపతులు ఊరూరా తిరిగి కోడిగుడ్లు అమ్ముతారు. వీరు పిల్లలు లేని తల్లిదండ్రులను గుర్తించి వారికి శిశువులను విక్రయించినట్లు విచారణలో తేలింది. అత్యధికంగా గుజరాత్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి శిశువులను రూ.20 వేల నుంచి 30వేల వరకు కొనుగోలు చేసి విక్రయిస్తారు.

### చిన్నారుల అరిగోస..

ఈ ముఠా విక్రయించే శిశువుల వయసు నెలలోపే ఉంటున్నది. తల్లులను దూరం చేసి వందలు, వేల కిలోమీటర్ల దూరం పాల సీసాలతో ప్రయాణాలు చేయించడం అంటే ఆ అరిగోస ఏ రీతిన ఉంటుందో చెప్పనలవికాదు. ఇక సూర్యాపేట పోలీసులు గుర్తించిన 10 మంది చిన్నారుల్లో ఒక సంవత్సరం నుంచి మూడేండ్ల వరకు ఉన్నారు. వారందరినీ నల్లగొండ శిశుహోంకు తరలించారు. కాగా ఈ కేసును సీఐడీకి బదిలీ చేయనున్నట్టు పోలీసుల విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.



నిందితులను చూపుతున్న పోలీసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

## గంజాయి సాగుచేస్తున్న
# ముఠా అరెస్టు

**రూ.3 లక్షల విలువైన 30 గంజాయి మొక్కలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం**

గంజాయి సాగుచేస్తూ విక్రయిస్తున్న ముఠాను గుడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, కొండమల్లేపల్లి ఇన్‌చార్జి సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం...

పెద్దఅడిశర్లపల్లి మే 29 : దుగ్యాల గ్రామానికి చెందిన నాగిళ్ల పాండరయ్య వ్యవసాయ భూమిని పీ.ఏ.పల్లి మండలం పిల్లిగుండ్ల తండాకు చెందిన ఇస్లావత్ చందు, ప్రకాశం జిల్లాకు చెందిన సింగారావు పండ్ల వ్యాపారి కౌలుకు తీసుకున్నారు. ఇందులో సింగారావుకు నాంపల్లి మండలంలో బండతిమ్మాపురానికి చెందిన కొత్తగొల్ల శ్రీను, రెవెల్లికి చెందిన వంగూరి శివతో పరిచయం ఏర్పడింది. ఇందులో శ్రీను, శివ, సింగారావుకు గంజాయి విత్తనాలు ఇచ్చి సాగు చేయమని చెప్పడంతో చందు, సింగారావు కలిసి మొక్కలు పెంచారు.విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పంచుకున్నారు. ఈ విషయంపై పోలీసులకు పక్కా సమాచారం అందడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించగా 30 గంజాయి మొక్కలు దొరికాయి. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి బైక్ మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఏఎస్పీ మౌనిక స్వయంగా పర్యవేక్షించగా కేసును ఛేదించిన గుడిపల్లి పోలీసులను ఎస్పీ శరత్ చంద్ర అభినందించారు.